

జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న క్రీడాకారుడు జశ్వంత్

## విద్యార్థులు క్రీడలపైనా దృష్టి సారించాలి: కలెక్టర్

**ముషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అన్నారు. సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న సందర్భంగా కోచ్ పులి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ కోచ్ పులి కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగిన క్రీడాపోటీలకు సహకరించిన డీఈవో రోహిణికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ డాక్టర్ కె.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి: ఎమ్మెల్యే

**ముషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు అందజేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలనలో, మీసేవలో దరఖాస్తు చేసుకున్నవారికి రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు సుదేష్, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి



ఏఎస్‌వో దీప్తితో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లో అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పౌరసరఫరాల శాఖ సర్కిల్-6 అసిస్టెంట్ సివిల్ సప్లైయ్ ఆఫీసర్ (ఏఎస్‌వో) డి.దీపికను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికలో పలు సవరణలు చేయాలని కోరారు. వార్షిక ఆదాయాన్ని తగ్గించినట్లయితే మరికొంత మంది పేద కుటుంబాలకు చేయూత కలుగుతుందన్నారు. సమీక్షలో కార్పొరేటర్‌తో పాటు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 26న పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవ వేడుక

**చిక్కడపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** హైదర్‌గూడ సెయింట్‌పాల్స్ హైస్కూల్ 1975 బ్యాచ్ టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 26న స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సెయింట్‌పాల్స్ పూర్వవిద్యార్థుల సంఘం పీఆర్‌వో టి.వివేకానంద తెలిపారు. సోమవారం చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తమ బ్యాచ్ స్వర్ణోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు పూర్వవిద్యార్థులు అందరూ నడుం బిగించారని వివరించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చిక్కడపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్‌మఠ్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, చెన్నారెడ్డినగర్ పరిధిలో 11 నుంచి 1 గంట వరకు, ఆజామాబాద్ పరిధిలో 12 నుంచి 1 గంట వరకు, నల్లకుంట పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, ఇందిరానగర్ పరిధిలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



జడ్సీ రవికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న వాజీద్‌హుస్సేన్ తదితరులు

## భోలక్‌పూర్‌లో సమస్యలను పరిష్కరించాలి

**ముషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** భోలక్‌పూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. సోమవారం జోనల్ కమిషనర్‌ను కలిసిన అనంతరం వాజీద్‌హుస్సేన్ మాట్లాడుతూ.. రంగానగర్, ఇందిరానగర్, తాజీర్‌నగర్, సిద్ధిక్‌నగర్, నవాబ్‌సాబ్ వీధి, గుల్షన్‌నగర్ ప్రాంతాలలో అధ్వానంగా మారిన రోడ్లను ఆధునికీకరించాలని కోరారు. ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహీమొద్దీన్, చాంద్, నియాజ్ అహ్మద్, అస్లామ్, ముజీమ్ హుస్సేన్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కె.గోవర్ధన్, చలపతిరావు, వెంకట్రామయ్య

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ముషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను సైతం వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20న నగరంలో భారీ బహిరంగసభ ప్రజా ప్రదర్శన నిర్వహించనున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం విద్యానగర్‌లోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు కె.గోవర్ధన్, జేవీ చలపతిరావు, వేములపల్లి వెంకట్రామయ్య, పీవోడబ్ల్యూ నాయకురాలు జి.ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు ఇస్తామన్న రుణమాఫీ సగం మందికి అమలు కాలేదన్నారు. రైతుబంధును తగ్గించి ఇస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

## ఉత్సాహం, ఉల్లాసం కలిగించేవి మంచి పాటలు

**చిక్కడపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** మంచి పాటలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు అన్నారు. రసరాగ వాహిని ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో తెలుగు, హిందీ సినిమా పాటల గానవిభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్, శ్రీనివాస్‌మూర్తి, చిదంబరశాస్త్రి, దక్షిణామూర్తి, రామమూర్తి, కామేశ్వరి, కనకదుర్గ, భార్గవి, లక్ష్మి తదితర ముప్పై మంది గాయనీగాయకులు గాన విభావరిలో గీతాలు ఆలపించారు. మంచి పాటలు వింటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వంశీ రామరాజు తెలిపారు.

# విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**రాచకొండ యాంటీ నార్కోటిక్ విభాగం డీఎస్పీ రమేష్**



ముషీరాబాద్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ రమేష్ తదితరులు

**ముషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాచకొండ యాంటీ నార్కోటిక్ విభాగం డీఎస్పీ రమేష్ సూచించారు. డ్రగ్స్ గంజాయి కారణంగా ఏర్పడే అనర్థాలను విద్యార్థులకు తెలియజేసేందుకు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వాడడం వల్ల ఏర్పడే అనర్థాలపై లఘుచిత్రం ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, జీవన్‌రెడ్డి, లక్ష్మీపతి, ముషీరాబాద్ డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు ఫాతిమా, నరేందర్‌యాదవ్, రతన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

**కవాడిగూడ:** విద్యార్థులు డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా తమ భవిష్యత్‌తో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాచకొండ యాంటీ నార్కోటిక్ విభాగం డీఎస్పీ ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా చదువుకొని ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆయన సూచించారు. సోమవారం కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాంటి నార్కోటిక్ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాంటి నార్కోటిక్ విభాగం డీఎస్పీ ఆర్ రమేష్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు జీవన్ రెడ్డి, నర్సింహ, ప్రిన్సిపాల్ మీనాకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి క్లాస్‌రూంలో విద్యార్థులతో జరిగిన సమావేశంలో డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నాగయ్య, యాకుబ్‌జానీ, సోమయ్య, హేమలత, సౌజన్య, సలావుద్దీన్, గాంధీనగర్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పురోహితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పురోహితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

**గోల్నాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** కొన్నేళ్లుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సొంత నిధులతో ప్రతి నెలా అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలలోని ఆలయాల్లో పురోహితులుగా పని చేస్తున్న 12 మందికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. సోమవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 12 మంది పురోహితులకు రూ.5 వేల చొప్పున అందజేశారు. పురోహితులకు అండగా నిలవాలనే తమవంతు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా పురోహితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

# తొలగించిన ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

**కవాడిగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** గురుకుల పాఠశాలలోని తొలగించిన ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తొలగించిన ఇన్‌స్ట్రక్టర్లు స్రవంతి, పల్లవి, అశ్విని, మురళి, శ్రీనివాస్, నజీర్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. అకారణంగా తమను విధుల నుంచి తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చీటికిమాటికి ప్రవేశ పరీక్షలు పెట్టి అర్హత సాధించలేదని కారణంతో ఉద్యోగులను తొలగించడం దారుణమన్నారు. ఒకసారి ఉద్యోగం సాధించిన తరువాత ఏ ఉద్యోగి అయినా తన జాబ్ చాట్ ప్రకారం విధులు నిర్వహిస్తుంటారే తప్పా.. ప్రతీ ఏడాది పరీక్ష కోసం ఏవిధంగా ప్రిపేర్ అవుతారని వారు ప్రశ్నించారు. సొసైటీలో ఏ ఉద్యోగికి లేని ప్రవేశ పరీక్ష తమకు ప్రతియేటా ఎందుకు నిర్వహిస్తున్నారని వారు ప్రశ్నించారు. ప్రవేశ పరీక్ష పేరుతో ఇప్పటివరకు 39 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు.

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ విద్యా సంస్థల్లోని ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ ప్రాజెక్ట్ విజయవంతం కోసం 2018లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందిస్తున్నట్లు వారు తెలిపారు. గత నవంబర్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం కోసం మొయినాబాద్‌కు ఐటీసిలను పిలిపించి పరీక్ష నిర్వహించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని, తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# 6, 7న ఓబీసీ జాతీయ సదస్సులు

**ఎంపీ ఆర్ కృష్ణయ్య**



జాతీయ సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

**బర్కత్‌పుర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని, పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జాతీయ స్థాయిలో బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి రూ.2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని తదితర ప్రధాన డిమాండ్లతో ఫిబ్రవరి 6, 7 తేదీలలో న్యూ ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామకాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో బీసీల రెండు తెలుగు రాష్ట్రాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరగనున్న ఓబీసీల జాతీయ సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 25 నుంచి 50 శాతానికి పెంచాలని, త్వరలో జరగనున్న జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, పారిశ్రామిక పాలసిలో బీసీలకు యాభై శాతం కోటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో జరగనున్న రెండు రోజుల ఓబీసీల సదస్సులో అన్ని పార్టీల నేతలు మేధావులు, ఎంపీలు, పలు బీసీ సంఘాల నేతలు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు రంగు విక్రమ్, నందగోపాల్, గొరిగ మల్లేష్, సుగుణ, వేముల రామకృష్ణ, ర్యాగ రమేష్, రాందేవ్ మోది, చింతా శ్రీనివాస్, రఘుపతి, వరప్రకాష్ పాల్గొన్నారు.

# సిప్.. సేవ్.. స్టైల్..!

**పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవకు విద్యార్థుల వినూత్న ప్రాజెక్టు**

**అభినందించిన ఇలంబరిది**

**హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ.. సామాజిక సేవ లక్ష్యంగా ఆ విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టు ఆకట్టుకుంటోంది. నిత్యావసరాల్లో భాగమైన పాల ప్యాకెట్లను పడేయకుండా ధృఢమైన ఫ్యాబ్రిక్‌లా మార్చి బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌లు, ఫోల్డర్ల వంటి పునర్వినియోగ వస్తువులను వారు తయారు చేస్తున్నారు. వాటి విక్రయం ద్వారా వచ్చే డబ్బులను నిరుపేదలకు ఆహారం అందించేందుకు వినియోగిస్తున్నారు. 'సిప్, సేవ్, స్టైల్' పేరిట వినూత్న ప్రాజెక్టు చేపట్టిన భారతీయ విద్యాభవన్, ఆత్మకూరు రామ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని కలిశారు. ప్రాజెక్టు వివరాలను ఆయనకు తెలిపారు. ప్లాస్టిక్ పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు.. సామాజిక సేవ కోసం ప్రాజెక్టు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇలంబరిది అభినందించారు. విద్యార్థుల సృజనాత్మక అభినందనీయమని పేర్కొన్నారు.

**● క్యాలెండర్ ఆవిష్కరణ**



గౌడ ఐక్య సాధన సమితి 2025 సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బబ్బురి భిక్షపతిగౌడ్, కోశాధికారి పుంజల హరిచరణ్ గౌడ్, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్, బాబుగౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

# ఎమ్మెల్సీగా గంగాధర్ విజయానికి విస్తృతంగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న పోకల కిరణ్‌మాదిగ తదితరులు

**బర్కత్‌పుర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** త్వరలో జరగనున్న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి విశ్రాంత పోలీసు అధికారి మదనం గంగాధర్‌కు గెలుపు కోసం ముమ్మర ప్రచారం చేస్తున్నట్లు పలు సంఘాల నేతలు తెలిపారు. గంగాధర్‌కు బీజేపీ మినహా కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష పార్టీలు మద్దతు తెలపాయని వారు తెలిపారు. బర్కత్‌పురలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, భారతీయ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానందరావు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, బీసీ సంఘం దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పుట్టం జంగన్నగౌడ్ మాట్లాడారు. సంచారా జాతి నుంచి డీఎస్పీ స్థాయికి ఎదిగిన గంగాధర్ వీఆర్ఎస్ తీసుకొని ప్రజాసేవ చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని వారు తెలిపారు. పట్టభద్రులు, మేధావులు, విద్యావంతులు గంగాధర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. సమావేశంలో ఆర్‌పిఐ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, 57 ఉపకులాల జాతీయ అధ్యక్షుడు కల్యాణ్ ప్రేమ్‌రాజ్, జేఏసీ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు కొంర్రు రాజు మాదిగ, బీసీ సంఘాల జేఏసీ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ఐలయ్య యాదవ్, రాజు,. బాల్‌రాజ్, బాలస్వామి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రై కమిషనరేట్లలో మోస్ట్ వాంటెడ్ దొంగ అరెస్ట్



భరత్‌కుమార్

**హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ ఘరానా దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఇళ్లలో దొంగతనాలకు ఉపయోగించే ఎక్విప్‌మెంట్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్ ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్ శర్మ అలియాస్ రాహుల్ కుమార్ శర్మ లేబర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు రాత్రిసమయాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. స్క్రూడ్రైవర్, ఐరన్ రాడ్డుతో తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులతో ఉడాయిస్తాడు. ఇలా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు.. ఇతర జిల్లాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మూడు కమిషనరేట్ల పరిధిలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ఉన్న భరత్‌కుమార్‌ను పట్టుకోవడానికి సిటీ సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. నిందితుడి కదలికలపై నిఘా పెట్టి రాచకొండ శివారులోని కీసర పరిధిలో సోమవారం అదుపులోకి తీసుకుంది.

## రెండు ఆలయాల్లో చోరీ

**సీసీ ఫుటేజీ బాక్సు ఎత్తుకెళ్లిన దుండగుడు**



చోరీకి గురైన హుండీ

**అడ్డగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** గంటల వ్యవధిలో రెండు ఆలయాల్లో హుండీ పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన పహాడి హనుమాన్ ఆలయంతో పాటు పక్కనే ఉన్న జై భవాని ఆలయం లో సోమవారం ఉదయం మూడు గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయంలో చొరబడి హుండీని పడులగొట్టి డబ్బును ఎత్తుకెళ్లారు. పహాడి హనుమాన్ ఆలయం వెనుక వైపు నుంచి వచ్చిన దుండగుడు ఆలయ తలుపు గొళ్లెం తొలగించి నేరుగా ఆలయం లోపలికి ప్రవేశించి ఆలయంలో ఉన్న హుండీ పగలగొట్టి చిల్లర డబ్బులు అక్కడే ఉంచి దాదాపు రెండు వేల వరకు ఉన్న నగదును ఎతుకెళ్లాడు. ఇదే ఆలయంలో నెల రోజుల క్రితమే హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఆలయం పక్కనే ఉన్న జై భవాని గుడిలో తలుపునకు గొళ్లెం ఆలయంలో ఉన్న సీసీ ఫుటేజీ బాక్సుతో పాటు దాదాపు రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారులు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కోకాపేట 'నియోపోలీసు'లో రిజర్వాయర్

**నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన హెచ్ఎండీఏ కమిషనర్, వాటర్‌బోర్డు ఎండీ**



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**హైదరాబాద్ సిటీ, జనవరి20 (ఆంధ్రజ్యోతి):** కోకాపేట నియోపోలీసు లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల్లో భాగంగా తాగునీటి సరఫరాకు రిజర్వాయర్‌ను నిర్మాణం చేయనున్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం ఇప్పటికే హెచ్ఎండీఏ స్థలం కేటాయించగా, సోమవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు నుంచినీటిని తీసుకుని ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించడానికి.. నియోపోలీస్‌లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పంప్‌హౌజ్, స్థానిక అవసరాల కోసం రిజర్వాయర్ నిర్మాణానికి స్థలం కావాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి.. హెచ్ఎండీఏ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుదర్శన్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్, ఇంజనీర్లు రవీందర్ రెడ్డి, అప్పారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కాండూట్‌ను కబ్జా చేస్తే తొలగించాలి: ఎండీ అశోక్‌రెడ్డి**

గండిపేట్ నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు ఉన్న కాండూట్‌ని వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఎక్కడైనా కాండూట్ కబ్జాకు గురైనట్లు గమనిస్తే విజిలెన్స్ అధికారుల సాయంతో తొలగించాలని ఆదేశాలిచ్చారు. కాండూట్‌కు రెండు వైపులా మెయింటెనెన్స్ రోడ్లు ఉన్నందున ఆ భాగం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడక్కడ జరుగుతున్న కాండూట్ లీకేజీలను గుర్తించి వెంటనే వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను, కోకాపేట్‌లో వాటర్‌బోర్డు రిజర్వాయర్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ప్రెజర్ ఫిల్టర్స్‌ను పరిశీలించారు. ఫిబ్రవరి 15 లోపు వీటి నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## ఐదో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి



మల్లేశ్ (ఫైల్)

**రాజేంద్రనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** కిస్మత్‌పూర్-బండ్లగూడ మార్గంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ప్రేవనావతిపేట్‌కు చెందిన కోరని మల్లేశ్ (27) బండ్లగూడ రహదారిలో ఉన్నఓ అపార్ట్‌మెంట్‌లో 27 రోజులుగా హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నాడు. మల్లేశ్‌కు మూడు సంవత్సరాల క్రితం మీనా అనే యువతితో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. మల్లేశ్ సోమవారం అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో ఉన్న నీటి సంపును శుభ్రం చేస్తున్నాడు. ఈ క్రమంలో పక్కనే పిట్టగోడకు ఎండ తగులకుండా ఏర్పాటుచేసిన రేకులపై కాలు పెట్టడంతో జారీ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు సదరు అపార్ట్‌మెంట్‌కు వెళ్లేలోపే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మల్లేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ కిషోర్ దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**బౌద్ధనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌నగర్ సవరాలబస్తీకి చెందిన కార్తీక్(17) కీసరలోని గురుకుల రెసిడెన్సియల్ కాలేజీలో బైపీసీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కార్తీక్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం తల్లితండ్రులు కూలీ పనులకు బయటకు వెళ్లి తిరిగి పన్నెండు గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు ఎంతకొట్టిన తీయకపోవటంతో కిటికిలో నుంచి చూడగా కార్తీక్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టి కార్తీక్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కార్తీక్‌కు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి సిద్ధులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## 'ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి'

**హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లు కావాలని 1272, రేషన్‌కార్డుల కోసం 87, పింఛన్ల కోసం 33, జీహెచ్ఎంసీకి సంబంధించి 8, విద్యాశాఖకు 9 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తమ విభాగాలకు వచ్చిన దరఖాస్తులపై నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటాచారి, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, అధికారులు ఆశన్న, రోహిణి, పవన్‌కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, రాజేందర్, శ్రీరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362